www.prajasakti.com
ప్రజాశక్తి
ఆదివారం 11 ఫిబ్రవరి 2024
5
తిరుపతి



మహిళలు స్వయం శక్తితో ఎదగాలి

తిరుపతి టౌన్ : మహిళలకు సుస్థిర జీవనోపాధి కల్పించాలన్న ముఖ్యమంత్రి వై.యస్.జగన్ మోహన్ రెడ్డి ఆశయాలకు అనుగుణంగా రాష్ట్ర వ్యాప్తంగా అర్హులైన సంఘ సభ్యులకు తిరుపతిలోని అనూస్ ప్రాంగణంలో మెప్మా మిషన్ డైరెక్టర్ విజయలక్ష్మి , తిరుపతి నగర పాలక సంస్థ మేయర్ శిరీష ,అనూస్ సంస్థ యం.డి అనురాధ తో కలిసి శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మిషన్ డైరెక్టర్ మాట్లాడుతూ ఈ శిక్షణకు గ్రాడ్యుయేషన్ పూర్తిచేసుకున్న, ఆసక్తి కలిగిన స్వయం సహాయక సంఘ సభ్యులను ఎంపికచేసి వారు స్వయం ఉపాధి పొందేలా శిక్షణ ఇస్తామన్నారు. మేయర్ శిరీష మాట్లాడుతూ ప్రతి మహిళను లక్షాధికారిని చేయడమే సిఎం లక్ష్యమన్నారు. చిత్తూరు జిల్లా మెప్మా ప్రాజెక్టు డైరెక్టర్ రాధమ్మ, మెప్మా ఎఒ రామాంజనేయులు, ఎస్ఎంఎంలు ఆదినారాయణ, శ్రీనివాస్, సిఎంఎం కృష్ణవేణి, ఆర్పిలు పాల్గొన్నారు. అనంతరం రామచంద్ర పుష్కరిణి సమీపంలో మెప్మా మహిళా మార్ట్ ఆధ్వర్యంలో మహిళలు నూతనంగా ఏర్పాటు చేసిన చపాతి మేకింగ్ యూనిట్ ను నగర మేయర్ డాక్టర్ శిరీష చేతుల మీదుగా ప్రారంభించారు.

రాపిడో..

నిరుద్యోగ యువతకు ఉపాధిగా...
రోజురోజుకూ పెరుగుతున్న ఆదరణ
అందుబాటులో కార్లు, ఆటోలు, బైక్‌లు

తిరుపతి జీవకోన స్లమ్ ఏరియా.. చిన్న సందులో ఉండే మునెమ్మకు ఇటీవల ఆరోగ్యం బాగోలేదు. ఆటోలో రుయాకు వెళ్లేందుకు ఆటో అడగ్గా రూ.200 అడిగారు. రానుపోను 500 అవుతుంది. ఇంతలో పక్కింట్లో యువకుడు రాపిడో బుక్‌చేశాడు. నిమిషాల్లో వారి ఇంటి వద్దకే ఆటో వచ్చి ఆగింది. అది కూడా కేవలం 60 రూపాయలకే.

తిరుపతి రూరల్ మల్లగుంట పంచాయతీలోని రామానుజం చెక్‌పోస్టుకు చేరువలో ఉన్న అంబేద్కర్ కాలనీ నుంచి ఓ యువతి ఇటీవల జేఇఇ మెయిన్స్‌కు కరకంబాడి రోడ్డులోని కళాశాలకు వెళ్లాలి. పేద కుటుంబం. ఇంట్లో ద్విచక్రవాహనం లేదు. వెంటనే స్నేహితుల సాయంతో రాపిడో బుక్ చేసింది. 8 కిలోమీటర్ల దూరంలో ఉన్న కళాశాలకు కేవలం రూ.80కే, 20 నిమిషాల వ్యవధిలో చేరవేశాడు. సరైన సమయానికి ఆ యువతి పరీక్షకు భద్రంగా హాజరయ్యింది.

అలిపిరి - చెర్లోపల్లి రోడ్డులోని అరవింద ఐ ఆస్పత్రికి రెండు రోజుల క్రితం కంటి వైద్యం కోసం వచ్చిన ఓ వృద్ధ దంపతులు తిరుగు ప్రయాణం కోసం అక్కడ సిబ్బంది సూచనతో రాపిడోలో ట్యాక్సీ బుక్ చేసుకున్నారు. అరవింద ఆస్పత్రి నుంచి రేణిగుంట రోడ్డులోని కొరమేనుగుంట వరకూ. ఇంటికి కేవలం 30 నిమిషాల్లో రూ.150కే భద్రంగా చేరారు.

ప్రజాశక్తి-తిరుపతి సిటి

రాపిడో..మన పక్కనే ఉన్నట్లుంటారు.. క్షణాల్లో మనవద్దకు వాలిపోతారు.. ఓ 'బ్రదర్'లా వీరు అందిస్తున్న సేవలతో రోజురోజుకూ వీరిపట్ల ఆదరణ పెరుగుతోంది. నిరుద్యోగ యువత 'రాపిడో'ను ఉపాధిగా మలచుకుంటున్నారు. స్మార్ట్‌ఫోన్ ఉన్న ప్రతి ఒక్కరికీ వీరు సుపరిచితమే. అతి తక్కువ ధరకు, ఇంటి వద్దకే వచ్చి, గమ్యస్థానానికి తక్కువ సమయంలో క్షేమంగా చేర్చడంలో రాపిడో అద్దె వాహనాలదే హవా. ట్యాక్సీ, కారు, ఆటోల నుంచి ఇప్పుడు ద్విచక్రవాహనాల్లోకి అడుగుపెట్టింది. తాజాగా తిరుపతి కేంద్రంలో రాపిడో కెప్టెన్లను సైతం సత్కరించి, ప్రయాణికులకు మరింత అవగాహన కల్పించారు. రాపిడో యాప్ అందరికీ అందుబాటులోకి రావడంతో వ్యక్తిగత బడ్జెట్‌లో కొంత మిగులుతుందనేది అక్షర సత్యం. చదువుకుంటున్న విద్యార్థులకు, నిరుద్యోగ యువతకు 'పాకెట్ మనీ'లా రాపిడో సేవల ద్వారా అందుతుండటం వల్లనే రోజురోజుకూ ఆదరణ పెరుగుతుంది. 'రక్షణ'లో భాగంగా వీరు హెల్మెట్ ధరిస్తున్నా, తాము ఎవరో తెలియకుండా ఉండేందుకూ వీరి హెల్మెట్ ఉపయోగపడుతుండటం గమనార్హం. రాపిడో సేవలందించిన తరువాత ప్రయాణికునికి ఫోన్ చేసి 'క్షేమంగా ఇంటికి చేరారా' అని అడగటం హైలెట్.

రాపిడో స్మార్ట్‌ఫోన్ ఉన్న ప్రతి ఒక్కరికీ సుపరిచితమే. యువత వాట్సాప్‌కు ఎలా కనెక్టు అయ్యారు. రాపిడోకి అంతే కనెక్టు అయ్యారు. ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి ప్రయాణికులు కోరిన విధంగా ట్యాక్సీ, కారు, ఆటో, ద్విచక్రవాహనాలను అద్దెకు పంపడం ఆ సంస్థ విధి. మెట్రోనగరాల్లోనే ఉండే ఈ సౌలభ్యం తిరుపతి నగరానికీ వ్యాపించింది. మొదట్లో కేవలం 10 మంది కెప్టన్లుతో (డ్రైవర్లతో) నడిచిన ఈ సంస్థ ఇప్పుడు తిరుపతి నగరంలోనే సుమారు 285 మంది కెప్టన్లు దీనిపై ఆధారపడి జీవిస్తున్నారు. సొంత ద్విచక్రవాహనం ఉన్న యువత ఇటీవల కాలంలో ఎక్కువగా రాపిడోలో తమ పేర్లు నమోదు చేసుకుని ఉపాధి రంగంగా మలుచుకుంటున్నారు. చదువుకునే విద్యార్థులు సైతం పార్ట్‌టైమ్‌గా ఈ ఉపాధి రంగాన్ని ఆశ్రయిస్తుండడం గమనార్హం. తక్కువ ధరకే, సుదూర ప్రాంతాలను సైతం క్షేమంగా, భద్రంగా చేర్చడం వల్ల, అందులోనూ డ్రైవరు పూర్తి వివరాలు ఆన్‌లైన్‌లో ఉండడం వల్ల అటు ప్రయాణీకులకు, ఇటు డ్రైవర్లకు ఇది చాలా భద్రత కల్పించేదిగా మారింది. దీంతో అనతికాలంలోనే రాపిడోకి ఆదరణ మరింత పెరిగింది.

రాపిడో కాస్త సాయంగా ఉంటోంది : ఎస్.సురేష్, పీజీ స్టూడెంట్

నేను తిరుపతిలో పీజీ చదువుతున్నా.. హాస్టల్‌లో ఉంటూ చదువుకుంటున్నా. అమ్మానాన్నలు చదువుకు అయ్యే ఖర్చు అంతా పంపిస్తారు. ఇటీవల రాపిడోలో నా సొంత బైక్‌ను రిజిస్టర్ చేసుకున్నాను. పార్టు టైమ్‌గా ప్రయాణీకులను చేరవేస్తున్నాను. దీని వల్ల కుటుంబంపై ఆధారపడకుండా నా చదువుకు నేనే సంపాదిస్తున్నాను. ఇది నాకు చాలా సహాయకారిగా ఉంది.

కుటుంబానికి అండగా ఉంటున్నాను : జి.ఎల్లయ్య, ఆటో డ్రైవర్, చెన్నారెడ్డి కాలనీ

నేను రెండేళ్ల క్రితం ఆటోను ఈఎంఐలో కొన్నాను. ఆటోకు గిరాకీలు సరిగా రాలేదు. మరోపక్క పెట్రోల్ ధరలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. దీంతో కుటుంబ పోషణ కష్టంగా ఉండేది. ఆరు నెలల క్రితం రాపిడోలో రిజిష్టర్‌చేసుకున్నాను. రోజూ క్రమం తప్పకుండా గిరాకీలు వస్తున్నాయి. సాయంత్రానికి ఇఎంఐ పోను కుటుంబానికి ఆదాయం మిగులుతోంది.

పంట కాల్వ పూడ్చి..

హైవే నిర్మాణం...రైతన్నకు శాపం

ఎండుతున్న 220 ఎకరాలు / చేతులెత్తేసిన ఇరిగేషన్ అధికారులు

ప్రజాశక్తి- పెళ్లకూరు

అన్నదాత పొట్టకొట్టి హైవే నిర్మాణం చేపట్టడమే పాలకుల దృష్టిలో అభివృద్ధిలా ఉంది.. నేషనల్ హైవే వారు బ్రిడ్జి నిర్మాణంలో భాగంగా పంట కాల్వను పూడ్చేశారు. దీంతో పదుల సంఖ్యలో గ్రామాల్లోని 220 ఎకరాల పంటలు ఎండిపోతున్నాయి. ఇరిగేషన్ అధికారులతో రైతులు మొరపెట్టుకోగా తామేమీ చేయలేమని చేతులెత్తేయడం గమనార్హం. కళ్లెదుటే ఎండుతున్న పంటలను చూసి దిక్కుతోచని రైతులు లబోదిబోమంటున్నారు.

పెళ్లకూరు మండలంలోని పెన్నేపల్లి గ్రామం వద్ద స్వర్ణముఖి నది నుంచి జువ్వలపాలెం, బిరదవాడ, ఉచ్చువారిపాలెం చెరువులకు వెళ్లే నీటి కాల్వను నేషనల్ హైవేవారు బ్రిడ్జి నిర్మాణంలో భాగంగా పూడ్చేశారు. దీంతో మూడు నెలలుగా జువ్వలపాలెం, బిరదవాడ, ఉచ్చువారిపాలెం, కానూరు, పెన్నేపల్లి, తాళ్లాయిపాడు రైతులకు చెందిన దాదాపు 220 ఎకరాలు ఎండిపోతున్నాయి. కాల్వ పూడిక తీయాలని రోడ్డు నిర్మాణ ఉద్యోగుల చుట్టూ రైతులు ప్రదక్షిణ చేస్తున్నా బాధ్యతారాహిత్యంగా వీరి తీరు ఉందన్న విమర్శలున్నాయి. రమేష్, హరీష్, రామయ్య, మరికొంతమంది ఒకరిమీద ఎవరు సంబంధం లేదని చెప్పుకుంటూ రైతులను అష్టకష్టాలు పెడుతున్నారు. వర్షాధార పంటలు పండించే తాము చెరువుల్లోకి నీరు పారకుండా పంట కాల్వ పూడ్చేయడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ రోడ్డెక్కడానికి సిద్ధం అవుతున్నారు. ప్రభుత్వ భూముల్లో, చెరువుల్లో,కొండలు, గుట్టలు అక్రమంగా తవ్వడానికి అక్కడున్న మట్టి గ్రావెల్ తరలించడానికి ఉన్న ఉత్సాహం, రైతులు నష్టపోతుంటే కనీసం కనికరం చూపడం లేదన్నది అన్నదాతల ఆవేదన.

పొలం పూర్తిగా ఎండిపోయింది : వెంకటాచలపతి, రైతు

నా పేరు వెంకటాచలపతి. స్వర్ణముఖి నది నుంచి జువ్వలపాలెం చెరువుకు నీరు వెళ్లే కాల్వ పక్కన మా పొలాలు ఉన్నాయి. రోడ్డు పనులు చేసే సమయంలో తోలిన మట్టితో కాల్వ పూడిపోయింది. బ్రిడ్జి నిర్మాణం పూర్తయినా కాల్వ పూడిక తీయలేదు. హైవే వారిని మా రైతులు అనేకమార్లు కలిసాం. పట్టించుకోకపోవడం వల్ల చెరువులో నీరు లేక పంటలు ఎండిపోయే దశకు చేరుకున్నాయి.

ఈ కాలవే మా పంటలకు ఆధారం : బాలాజీ, పెన్నేపల్లి

పెన్నేపల్లి గ్రామం దగ్గర స్వర్ణముఖి నది పరిసర ప్రాంతాల నుంచి నేషనల్ హైవే దాటుకుని చెరువులకు వచ్చే నీరు జువ్వలపాలెం కాల్వ ద్వారా ఆరు గ్రామాలకు వస్తుంది. బ్రిడ్జి నిర్మిస్తున్నపుడు ఆ కాల్వ పూడిపోయింది. హైవే వారిని అడిగితే తమకు సంబంధం లేదంటున్నారు. ప్రాధేయపడ్డా ఫలితం లేకపోయింది. చెరువుల్లో నీరు లేక 250 ఎకరాల పైరు ఎండిపోతోంది.

పంటలు ఎండిపోతున్నది వాస్తవమే : ఇరిగేషన్ ఎఇ

రైతుల కష్టాలు వాస్తవమే. పంటలు కళ్లెదుటే ఎండిపోతున్నాయి. అన్నదాతల తరపున అనేకమార్లు హైవే నిర్మాణం వారికి అనేకమార్లు తెలియజేశాం. పట్టించుకోలేదు

శిక్షణా తరగతుల్లో ప్రసంగిస్తున్న కందారపు మురళి

అంగన్వాడీల పోరాటం చిరస్మరణీయం : సిఐటియు

ప్రజాశక్తి -తిరుపతి టౌన్

అంగన్వాడీల పోరాటం చిరస్మరణీయమని, కార్మిక వర్గ పోరాటాల చరిత్ర పేజీలలో దీనికి ఒక ముఖ్యమైన స్థానం ఏర్పడిందని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి అన్నారు. శని, ఆదివారాల్లో తిరుపతి జిల్లాలోని అంగన్వాడి కార్యకర్తలకు సిఐటియు జిల్లా కార్యాలయంలో నిర్వహించిన ఉద్యమ శిక్షణా తరగతుల ప్రారంభ సభకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి యస్ వాణిశ్రీ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో కందారపు మురళి ప్రసంగిస్తూ అంగన్వాడీల పోరాటం కార్మికోద్యమ చరిత్రలో ఓ మైలురాయిగా అభివర్ణించారు. దేశంలో మోడీ, రాష్ట్రంలో జగన్మోహన్ రెడ్డిలు అనుసరిస్తున్న విధానాలు ప్రజల మనోభావాలకు భిన్నమైనవని, ప్రజాభిప్రాయానికి అనుగుణంగా పరిపాలన లేదని... సమస్యల నుంచి పక్కదారి మళ్లించడానికి మతం పేరుతో, కులం పేరుతో ప్రజల మధ్య వైషమ్యాలు సృష్టించడానికి ప్రయత్నిస్తున్నాయని ఆరోపించారు. అంగన్వాడీలు జీతాల కోసం పోరాడే సంఘం కాదని సమాజ మార్పుకు దోహదం చేసే సంఘంగా పరిణితి చెందాల్సిన ఆవశ్యకత ఉందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ గౌరవాధ్యక్షులు కేవిఎన్ ప్రసాదరావు, స్వరూప రాణి, శ్యామలమ్మ, ముని కుమారి, ధనమ్మ, సౌజన్య, పుష్ప, రేవతి, రాజేశ్వరి, ఇంద్రావతి, నిర్మల, ప్రభావతి, మంజుల, హైమావతి, నాగరాజమ్మ తదితరులు పాల్గొన్నారు.

రాజకీయ 'చదరంగం'

ఉప ఎన్నిక దొంగోట్లపై 'పోస్టుమార్టం'
చంద్రమౌళీశ్వర్‌రెడ్డి ఛాంబర్‌లో విచారణ
మరింత కూపీ లాగుతున్న ఎన్నికల సంఘం

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

తిరుపతి పార్లమెంట్ ఉప ఎన్నికల్లో 35వేల దొంగ ఓట్లను నమోదు చేశారన్న ఆరోపణతో తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ కమిషనర్ గా పని చేసి ఇటీవల విజయవాడ మెప్మా అసిస్టెంట్ డైరెక్టర్గా బదిలీ అయిన చంద్రమౌళీశ్వర్ రెడ్డిని సస్పెండ్ చేసిన విషయం తెలిసిందే. ఎన్నికల లాగిన్ లో దొంగ ఓట్లు ఎలా నమోదు చేశారన్న విషయమై తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ కమిషనర్ ఛాంబర్‌లో గత నాలుగు రోజులుగా రాష్ట్ర ఎన్నికల సంఘం ప్రతినిధులు, పోలీసులు పోస్టుమార్టం నిర్వహిస్తున్నారు. ఈ విషయం రహస్యంగా సాగుతుంది. చంద్రమౌళీశ్వర్ రెడ్డి ఈఆర్ఓ కాకపోయినప్పటికీ ఆయన ఈఆర్ఓగా ఎలా పని చేశారు. ఏ విధంగా ఓటర్లను చేర్చారు, తిరుపతిలో నివాసం లేకపోయినా ఓటరుగా ఉన్నట్టుగా ఎలా సృష్టించారు. ఆ ఓటర్ ఉప ఎన్నికల్లో ఓటు వేశారా, లేదా, చనిపోయిన ఓటర్లు బతికి ఉన్నట్లు ఆ ఓట్లు వేశారా. లేదా అనేది డిప్యూటీ కమిషనర్ గా పనిచేసిన చంద్రమౌళీశ్వర్ రెడ్డి సంబంధించిన కంప్యూటర్లు ,ల్యాప్టాప్‌లు క్షుణ్ణంగా సోదాలు నిర్వహించారు. చంద్రమౌళీశ్వర్ రెడ్డికి దొంగ ఓట్లు నమోదు చేసే సమయంలో సిబ్బంది ఏవిధంగా సహకరించారనేది ఆరా తీస్తున్నారు. ఈ విచారణకు ఎన్నికల సంఘం పోలీస్ ప్రత్యేక బందాన్ని ఏర్పాటు చేసింది. గత కొన్ని రోజులుగా పోలీసులు ఒక్కొక్కరిని పిలిపించి విచారిస్తున్నారు. సమాచారాన్ని వీడియోల్లో నమోదు చేస్తున్నారు. తిరుపతి కార్పొరేషన్ కార్యాలయంలోనే చేశారా? లేక వేరే ప్రాంతాల్లో ఈ ప్రక్రియ సాగిందా అనేది విచారణ జరుగుతోంది. చంద్రమౌళీశ్వర్‌రెడ్డితో పాటు ఇతర ఉన్నతాధికారులు, కింది స్థాయి సిబ్బంది పాత్ర ఎంతుందో ఈ విచారణలో తేల్చనున్నారు. రాజకీయ నేతల పాత్రపైనా ఆరా తీస్తున్నట్లు తెలుస్తోంది. తిరుపతి డిప్యూటీ కమిషనర్‌గా పనిచేసిన చంద్రమౌళీశ్వర్ రెడ్డి ఎన్నికల సంఘాన్ని మోసం చేయడమే కాకుండా కుట్ర పన్నారు అనేది ఆయనపై కేంద్ర ఎన్నికల సంఘం ముద్ర వేసింది.



కనబడని దస్త్రాలు

తిరుపతి ఉప ఎన్నికల సందర్భంగా ఎన్నికల అధికారులు పంపిన పలు జీవో కాపీలు , ఇతర దస్త్రాలు కనబడడం లేదని తిరుపతి నగర పాలక సంస్థలు గుసగుసలాడుతున్నాయి. కేంద్ర ఎన్నికల సంఘంతో పాటు రాష్ట్ర ఎన్నికల సంఘం పంపిన కొన్ని జీవో కాపీలో పలువురికి ఉద్యోగులకు బాధ్యతలు అప్పజెప్పడం జరిగింది. ఆ బాధ్యతలు ఎవరెవరు నిర్వహించారు సంబంధించిన ఫైలు పోలీసు ప్రత్యేక బందం నాలుగు రోజుల నుంచి వెతుకులాట చేసిన కనబడడం లేదని సమాచారం. తిరుపతి డిప్యూటీ కమిషనర్ ఛాంబర్ లో ఉదయం నుంచి రాత్రి వరకు అన్ని విభాగాలు సంబంధించిన సిబ్బందిని పిలిపించి ఎన్నికల దస్త్రాలు గురించి ఆరా తీయడం జరిగింది. ఈ దస్త్రాలు ఉన్నాయా లేదా, లేదంటే దాచి పెట్టారా అనేది తెలియాల్సి ఉంది. చంద్రమౌళీశ్వర్ రెడ్డి ఈఆర్ఓ కాకపోయినప్పటికీ ఐడి లాగిన్ పాస్వర్డ్ ఇతర సంబంధించిన అధికారాలు ఎలా తీసుకున్నారని చర్చ నడుస్తోంది.

క్రిమినల్ కేసు నమోదు చేసే అవకాశం

ఎన్నికల సంఘాన్ని మోసం చేసిన తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ కమిషన్ చంద్రమౌళీశ్వర్ రెడ్డిపై క్రిమినల్ కేసు నమోదు చేసే అవకాశం ఉందని తెలుస్తుంది. దేశంలో ఎక్కడా జరగని విధంగా తిరుపతి పార్లమెంటు ఉప ఎన్నికల్లో దొంగ ఓట్లను నమోదు చేయడమే కాకుండా ఎన్నికల విధులు నిర్వహించి ఎన్నికల సంఘానికి తెలియకుండా ఈఆర్వోగా వ్యవహరించడం కేంద్ర ఎన్నికల సంఘం ఈ విషయంపై చాలా సీరియస్ గా ఉన్నట్టు తెలుస్తోంది. అయితే చంద్రమౌళీశ్వర్ రెడ్డికి రాజకీయ నేతలు అండగా ఉంటారా? లేక బలిచేస్తారా? అన్నది వేచి చూడాల్సిందే. ఏదిఏమైనా ఎన్నికల విధుల్లో ఉండే ఉన్నతాధికారులకు ఇది ఒక గుణపాఠం.

మార్చి 18 నుంచి టెన్త్ పరీక్షలు

జిల్లాలో 30,921 మంది విద్యార్థులు
సమస్యాత్మక కేంద్రాలపై ప్రత్యేక నిఘా

ప్రజాశక్తి -తిరుపతి టౌన్

జిల్లాలో 2024 టెన్త్ పరీక్షలు మార్చి 18 వ తేది నుంచి 30 వ తేది వరకు పకడ్బందీగా నిర్వహించేలా ప్రత్యేక చర్యలు చేపట్టాలని జిల్లా జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్ ఆదేశించారు. మొత్తం 30,921 మంది పరీక్ష రాయనున్నారని చెప్పారు. పరీక్ష ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.45 వరకూ ఉంటుందన్నారు. శనివారం సాయంత్రం కలెక్టర్ ఛాంబర్ నందు సంబంధిత శాఖల సిబ్బందితో పదవ తరగతి పరీక్షల నిర్వహణపై సమీక్ష నిర్వహించారు. జేసీ మాట్లాడుతూ జిల్లాలో 162 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశామని, ఏమైనా లోటుపాట్లు ఉండే ముందుగానే చక్కదిద్దాలన్నారు. ప్రతి పరీక్షా కేంద్రం వదద తాగునీటి వసతి, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, బీపీ, సుగర్‌చెక్‌చేసే పరికరాలు, అత్యవసర మందులతో వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది ఒకరు అందుబాటులో ఉండాలన్నారు. అన్ని పరీక్షా కేంద్రాల వదద 144 సెక్షన్ అమల్లో ఉంటుందన్నారు. మాస్‌కాపీయింగ్ నిరోధించేందుకు ఆరు ఫ్లయింగ్ స్క్వాడ్‌లను ఏర్పాటు చేసి ప్రతిరోజూ కేంద్రాలను తనిఖీ చేస్తాయన్నారు. సమస్యాత్మక కేంద్రాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ఈ సమావేశంలో డిప్యూటీ ఈ ఓ, డి ఎం హెచ్ ఓ శ్రీహరి, డి పి ఓ రాజశేఖర్ రెడ్డి, ఆర్ ఐ ఓ ప్రభాకర్ రెడ్డి, తిరుచానూరు ఇన్స్పెక్టర్ శ్రీకాంత్ రెడ్డి పాల్గొన్నారు.

స్విమ్స్‌లో 'గోవిందనామ' భజన
రోగులకు ఆత్మస్థైర్యం నింపేదుకట..

ప్రజాశక్తి - తిరుపతి

అత్యాధునిక వైద్య సౌకర్యాలతో రోగులకు సేవలందించాల్సిన స్విమ్స్ ఆధ్యాత్మిక అడుగులు వేస్తోంది. సైన్స్‌కు మూఢనమ్మకాలను మిళితం చేస్తోంది. ఆధునిక టెక్నాలజీతో రోగిని బతికించి ఆత్మస్థైర్యం నింపాల్సిన వైద్యులు 'భజన' కార్యక్రమాలను ప్రారంభించారు. శనివారం సాయంత్రం ఆరు గంటలకు స్విమ్స్ శ్రీ వేంకటేశ్వర ఆలయంలో విష్ణు సహస్ర నామ స్తోత్రం పారాయణం, గోవిందనామ భజన కార్యక్రమాలను స్విమ్స్ డీన్ డాక్టర్ అల్లాడి మోహన్ ప్రారంభించారు. ఉపకులపతి ఆర్వి కుమార్‌కు ఈ బృందం ప్రత్యేక ధన్యవాదాలు తెలిపింది. డాక్టర్ అల్లాడి మోహన్ మాట్లాడుతూ ప్రస్తుతం అమల్లో ఉన్న వైద్య విధానంలో రోగానికి వైద్యం అందుతుందని, సనాతన ధర్మంలో భారతీయ సంస్కృతిలో అనాదిగా కేవలం రోగానికే కాకుండా రోగికి, వారి పరివారానికి వైద్యసేవలు అందించడం పరిపాటన్నారు. అందుకు మందులు, శస్త్ర చికిత్సలతో పాటు భగవదనుగ్రహం పొందేందుకు శ్రీ విష్ణు సహస్ర నామ స్తోత్రం పారాయణం, గోవింద నామాల పారాయణం, ధన్వంతరి మంత్రి జపం తోడ్పడతాయన్నారు. ప్రతి శనివారం జరిగే .జనహితం, సమాజహిత పారాయణ కార్యక్రమం ప్రశంసనీయమన్నారు. వికాస తరంగిణి నాగేంద్రసాయి మాట్లాడుతూ మనిషి ఎంత ఒత్తిడికి గురైనా మనిషి ఉల్లాసంగా, ఉత్సాహంగా ఉండటానికి విష్ణు సహస్ర నామం ఎంతగానో దోహదపడుతుందన్నారు. ధన్వంతరి మంత్రం జపిస్తే ఆరోగ్యంగా ఉంటారని, గోవింద నామం స్వామికి ప్రియమైనదని, గోవిందా అని పిలిస్తే పలుకుతారని తెలిపారు. నాగేంద్రసాయి, వికాస తరంగిణి కన్వీనర్ డాక్టర్ సుధావాణి, ఎన్.హేమలత, సౌందర్యలహరి బృందం పాల్గొన్నారు.

ధార్మికానికి 'టిటిడి' దర్శకత్వం

ప్రజాశక్తి-తిరుపతి సిటి

ధర్మోరక్షితి రక్షిత్త అనే నినాదంతో ముందుకెళ్లుతున్న తిరుమల తిరుపతి దేవస్థానం (టిటిడి) ధార్మిక సదస్సుకు దర్శకత్వం, నిర్మాత, స్క్రీన్‌ప్లే అన్ని తానై వ్యవహరించింది. తూతూ మంత్రంగా కొంత మంది స్వామీజీలను పిలిపించి, సదస్సు సన్నివేశాలను రక్తికట్టించింది. తాము ముందే అనుకున్న ప్రణాళికలను స్వామీజీల చేత చెప్పించి, వాటిని తీర్మాన రూపంలో తీసుకొచ్చారని భక్తులు, స్థానికులు బహిరంగంగానే చర్చించుకోవడం గమనార్హం.

ఫిబ్రవరి 3వ తేది నుంచి 5వ తేది వరకు మూడు రోజుల పాటు టిటిడి ఆధ్వర్యంలో తిరుమల కేంద్రంగా శ్రీవేంకటేశ్వర ధార్మిక సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు పలు పీఠాధిపతులను ఆహ్వానించారు. పేరు మోపిన పీఠాధిపతులు గైర్హాజరైనా, చిన్నాచితకా కొంతమంది హాజరయ్యారు. టిటిడి చైర్మన్ అధ్యక్షతన, ఈవో పర్యవేక్షణలో జరిగిన సదస్సుల్లో పీఠాధిపతులు ముందుగా అనుకున్న స్క్రిప్టు ప్రకారం నడుచుకున్నారు. హింధూ ధర్మాన్ని పరిరక్షించాలని, ఇందుకు విస్తృత ప్రచారం చేయాలని, ఇతర మతస్తులు స్వచ్ఛందంగా వస్తే హిందూ మతంలోకి స్వాగతించాలని నిర్ణయించారు. వాస్తవానికి ఇటీవల టిటిడిపై పలు ఆరోపణలు వచ్చాయి. ప్రస్తుత శ్రీవాణి ట్రస్టు పేరుతో వస్తున్న నిధులపై, ఓ మతానికి చెందిన ఫైవ్‌స్టార్ హోటల్ నిర్మాణంపై, టిటిడి పాలకుల చేతివాటంపై అనేక విమర్శలు వచ్చాయి. నిజనిర్ధారణ కమిటీ అంటూ విచారణ నిర్వహించి, తాము సచ్చీలు అని పరోక్షంగా చెప్పుకొచ్చారు. సాక్షాత్తు కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి, హిందు మతానికి పెద్దన్నలమను చెప్పుకునే పార్టీకి చెందిన వారే తీవ్రస్థాయిలో టిటిడిలో లొసుగులపై ఆరోపణలు గుప్పించారు. వాటిని తిప్పికొట్టేందుకు టిటిడి ఈ సదస్సును ఉపయోగించుకుంది. బిజెపికి చెందిన స్థానిక నాయకులను పీఠాధిపతులు, మఠాధిపతుల ద్వారా తిట్టించి, టిటిడి వ్యవహారాల్లో వేలు పెట్టడం సరైనది కాదని హితవు పలికేలా చేయడంలో సఫలీకృతులయ్యారు.

'ధర్మ' రక్షణ ఏది..?

ధర్మాన్ని రక్షించండి అది మిమ్మల్ని కాపాడుతుందని చెప్పే టిటిడి ధర్మాన్ని ఏమేరకు పాటిస్తోందని పలువురు ఆధ్యాత్మిక వేత్తలే ప్రశ్నిస్తున్నారు. టిటిడి ఆధ్వర్యంలో సుమారు 20వేల మందికిపైగా ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు విధులు నిర్వహిస్తున్నారు. శాశ్వత ఉద్యోగులు అవసరమైన చోట కూడా తాత్కాలిక పేరుతో కాంట్రాక్టు వ్యవస్థను అమలు చేస్తున్నారు. అందులోనూ కనీస వేతనాలు లేవు, కార్మికులకు మౌళిక వసతులు లేవు, ఇదేమని ప్రశ్నిస్తే విధుల నుంచి తొలగించడమే పనిగా పెట్టుకుంటున్నారు. బోర్డు తీర్మానాలను అధికారులు అమలు చేయరు. కోర్టు తీర్పులను టిటిడి పట్టించుకోదు. కార్మికుల నిరసనలను లెక్కచేయదు. నియంతలా వ్యవహరిస్తున్న యాజమాన్య తీరుపై స్థానికులు, మేధావులు సైతం అనేకసార్లు తూర్పారపట్టారు. ఇప్పటికైనా టిటిడి సామాన్యులకు పెద్దపీటవేయాలి, కార్పొరేట్ శక్తుల మాయను వీడాలని పలువురు కోరుతున్నారు.

రాత్రికి రాత్రే మార్పులు

తిరుమలలో నిబంధనలు ఉల్లంఘన
విశాఖ శారదా పీఠం మఠం నిర్వాకం

ప్రజాశక్తి -తిరుమల

తిరుమలలోని విశాఖ శారదా పీఠం మఠాన్ని ఏపీ హైకోర్టు అడ్వకేట్ కమిషన్ శనివారం పరిశీలించింది. కొండపైన భవన నిర్మాణ నిబంధనలకు విరుద్ధంగా శారదాపీఠం వారు మఠం నిర్మించారని తిరుక్షేత్రాల పరిరక్షణ సమితి నేత తిరుపతికి చెందిన తుమ్మా ఓంకార్ హైకోర్టులో ప్రజాప్రయోజనాల వ్యాజ్యం దాఖలు చేసారు. శారదపీఠం భూఆక్రమణ చేసిందంటూ దాఖలైన పిటిషన్‌ను స్వీకరించిన హైకోర్టు, వాస్తవాలను క్షేత్రస్థాయిలో పరిశీలించేందుకు అడ్వకేట్ కమిషన్ ను నియమించింది. ఈ మేరకు హైకోర్టు న్యాయవాది వివేకానంద విరుపాక్ష, పిటిషినర్ తరపు న్యాయవాది జితేంద్ర, టీటీడీ న్యాయాధికారి, రెవెన్యూ అధికారులు మఠాన్ని పరిశీలించారు. భవనం యొక్క చుట్టు కొలతలు, ఎత్తుతో పాటు నిభందనలను ఎక్కడైనా అతిక్రమించారా అనే కోణంలో క్షేత్రస్థాయిలో అడ్వకేట్ కమిషనర్ పరిశీలించారు. కాగా పిటిషన్ వేసిన నాటికి... నేటికి భవనం యొక్క పరిస్థితి వేరేలా ఉందని, హైకోర్టు ఆర్డరు బేఖాతరు చేస్తూ మఠం నిర్వాహకులు భవన నిర్మాణం చేపడుతున్నారని, కమిషన్ తనిఖీకి వస్తుందని తెలిపి రాత్రికిరాత్రి సెల్లార్ లోని గదులను, మండపం యొక్క గోడలను తొలగించి కార్ పార్కింగ్ స్థలంగా మార్చారని, ఏ మాత్రం భద్రతా ప్రమాణాలు లేకుండా కనీసం సెట్ బ్యాక్స్ కూడా లేకుండా ఇష్టప్రకారం భవనాన్ని నిర్భించారని పిటిషనర్ అన్నారు. అతిక్రమణలను తొలగించమని కోర్టు తీర్పు ఇస్తుందని ఆశిస్తున్నట్లు ఆశాభావం వ్యక్తం చేసారు.



పోలింగ్ కేంద్రాల్లో పక్కాగా ఏర్పాట్లు : అదితి సింగ్

తిరుపతి టౌన్ : తిరుపతి నియోజకవర్గ పరిధిలోని పోలింగ్ కేంద్రాలలో ఓటర్లకు అన్ని ఏర్పాట్లు పక్కాగా చేయాలని తిరుపతి నియోజకవర్గ ఓటర్ నమోదు అధికారి, నగరపాలక సంస్థ కమిషనర్ అదితి సింగ్ అధికారులను ఆదేశించారు. శనివారం మధ్యాహ్నం నగరంలోని పలు పోలింగ్ కేంద్రాలను, ఎస్వీ ఆర్ట్స్ కాలేజీలో స్ట్రాంగ్ రూమ్ ఏర్పాటు గదులను అధికారులతో కలిసి కమిషనర్ పరిశీలించారు. ముందుగా ఈవియం, బ్యాలెట్ బాక్సులు భద్ర పరిచేందుకు ఎస్వీ ఆర్ట్స్ కాలేజీలో స్ట్రాంగ్ రూమ్ ఏర్పాటు గదులను పరిశీలించారు. ఫ్యాన్లు, విద్యుత్ దీపాలు, తాగునీరు, మరుగుదొడ్ల సౌకర్యం ఉండేలా చూడాలని అన్నారు. అలాగే అన్ని పోలింగ్ కేంద్రాల్లోకి వద్దులు, వికలాంగులు వెళ్లేందుకు ర్యాంప్ ఏర్పాటు చేయాలన్నారు. కమిషనర్ వెంట డిప్యూటీ కమిషనర్ అమరయ్య, డి.ఈ. మహేష్, తేజస్విని ఉన్నారు.

బాలాజి ఆరోగ్య వరప్రసాదినికి రూ. 10లక్షల విరాళం

ప్రజాశక్తి -తిరుపతి సిటీ

అనంతపురం జిల్లా గుంతకల్ వాస్తవ్యుడు, ప్రస్తుతం బెంగుళూరులో స్థిరపడిన రాచూరు వెంకట కిరణ్, వారి కుటుంబ సభ్యులు శ్రీ బాలాజి ఆరోగ్య వరప్రసాదిని పథకానికి రూ. 10,00116 డి.డి.ని శనివారం స్విమ్స్ డైరెక్టర్ కార్యాలయంలో ఇన్చార్జి డైరెక్టర్ డాక్టర్ రాంను కలిసి అందజేశారు. ఈ సందర్భంగా దాతలు మాట్లాడుతూ శ్రీవారిపై ఉన్న భక్తి విశ్వాసములతోను, స్విమ్స్ పేద ప్రజలకు అందజేస్తున్న వైద్య సేవలకు గానూ ఈ విరాళ డి.డి.ని అందజేశామన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ వరుణ్ తేజ, ఇన్చార్జి గౌస్, పాల్గొన్నారు.

రేపు విద్యార్థులకు క్విజ్ పోటీలు

ప్రజాశక్తి- రేణిగుంట: జన విజ్ఞాన వేదిక రేణిగుంట కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించే ఈ నెల 12వ తేదీ సోమవారం నిర్వహించనున్న క్విజ్ పోటీల్లో విద్యార్థులు తప్పక పాల్గొనాలని జన విజ్ఞాన వేదిక కమిటీ అధ్యక్షులు కార్యదర్శులు ఇమామ్, కుప్పస్వామి తెలిపారు. శనివారం వారు విలేకరులతో మాట్లాడుతూ విజ్ఞాన శాస్త్రం అన్వేషణలో మైలురాయి జీవ పరిమాణ సిద్ధాంతం ఆవిష్కర్త చార్లెస్ డార్విన్ 214 వ జయంతి సందర్భంగా రేణిగుంట కమిటీ ఆధ్వర్యంలో సోమవారం హైస్కూలు విద్యార్థులకు మండల స్థాయిలో విశ్వం పుట్టుక, జీవన పరిణామ సిద్ధాంతం, శాస్త్రీయ దృక్పథం' అనే అంశాలపై రేణిగుంట మండల సమావేశ మందిరంలో క్విజ్ పోటీలు నిర్వహిస్తామని, ఈ పోటీల్లో 8,9,10, వతరగతి విద్యార్థులు నలుగురు జట్టుగా పాల్గొనాలని వారు పేర్కొన్నారు.

అధికారుల తనిఖీ అమానుషం: టిడిపి

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : రాజకీయ కక్షతో నారాయణ సంస్థలపై అధికార పార్టీ తనిఖీలు చేయించడాన్ని ఖండిస్తున్నామని టిడిపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు శీలం కిరణ్ కుమార్ పేర్కొన్నారు. స్థానిక టిడిపి కార్యాలయంలో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో కిరణ్ కుమార్ మాట్లాడుతూ రాజకీయ కక్షతో నెల్లూరులో నారాయణ సంస్థలపై డ్రగ్స్, రెవెన్యూ పోలీస్ అధికారులు వచ్చి తనిఖీల పేరుతో వారి క్యాంపు కార్యాలయం లోకి వెళ్లడం అమానుషం అన్నారు. నారాయణ సతీమణిని గృహనిర్బంధం చేశారని ఇటువంటి వాటికి పార్టీ నాయకులెవరూ భయపడరని రాబోయే ఎన్నికల్లో ప్రజలే తగిన గుణపాఠం చెబుతారన్నారు. ఈ సమావేశంలో బిల్లు చెంచురామయ్య , రహీం, శివకుమార్, వెంకటేశ్వరరాజు, రవీందర్ రెడ్డి, అల్లి బాష, సునీల్, నరసింహు లు, ప్రణీత్ యాదవ్ పాల్గొన్నారు.

కెవిపి రామచంద్రరావును కలిసిన నాగభూషణం

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : తనకు కాంగ్రెస్ తరపున గూడూరు సీటు కేటాయిస్తే తన సత్తా చాటుకుంటానని గూడూరు మండల కాంగ్రెస్ అధ్యక్షుడు దర్శి నాగభూషణం పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యాలయంలో ఈ మేరకు ఆయన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్యాలయంలో రాజ్యసభ సభ్యులు కెవిపి రామచంద్రరావును కలిశానని తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌లో ఎప్పుడు ఎన్నికలు నిర్వహించినా కాంగ్రెస్ ఆదేశాలను తప్పకుండా పాటిస్తూ అభ్యర్థులను పోటీలో నిలబెట్టి మండలంలో తన సత్తా చాటుకుంటున్నానని తెలిపారు. యువ నాయకులు, నియోజకవర్గంలోని అన్నీ గ్రామాలలో పట్టున్న నాయకునిగా తనకు గుర్తింపు వుందని తెలుపుకుంటూఎమ్మెల్యే అభ్యర్థిగా ఎంపిక చేసి ప్రకటించాలని కోరానని తెలిపారు.

వృద్ధాశ్రమంలో అన్నదానం

ప్రజాశక్తి - గూడూరు రూరల్

గూడూరు లోని ఓం శ్రీ సాయిరాం వృద్ధాశ్రమంలో ప్రగతి సేవా సంస్థ ఆధ్వర్యంలో దాతలు మెడనూరు సురేష్ రెడ్డి , శాంతి దంపతుల సాయంతో శనివారం అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షులు కడివేటి చంద్ర శేఖర్ మాట్లాడుతూ ప్రతి నెల రెండవ శనివారం క్రమం తప్పకుండా ఇస్తున్న విధంగా వృద్ధాశ్రమంలో తమ సంస్థ ద్వారా అన్నదానం నిర్వహిస్తోందన్నారు. దాతల సహకారం మరువలేనిదన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ సభ్యులు శ్రీనివాసులు, రామ్మోహన్ రావు, ప్రభాకర్, రాము, ముని ప్రసాద్ , వెంకటేశ్వర్లు , నాగరాజు, లక్షణ, ఆశ్రమ నిర్వాహకురాలు కళ్యాణి పాల్గొన్నారు.

టిడిపి 'జయహో బిసి' సభ

ప్రజాశక్తి- బుచ్చినాయుడు కండ్రిగ

బుచ్చినాయుడు కండ్రిగ మండలంలో శనివారం టిడిపి మండల అధ్యక్షుడు సుధాకర్ నాయుడు ఆధ్వర్యంలో స్టేట్ బ్యాంకు పరిసర ప్రాంతాలలో జయహో బిసిసభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సత్యవేడు నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి హెలెన్ హేమలత , మాజీ ఎమ్మెల్యే హేమలత పార్లమెంట్ అధ్యక్షులు గొల్ల నరసింహయాదవ్, రాష్ట్ర బీసీ సెల్ నాయకులు, పార్లమెంట్ బీసీ నాయకులు, మండల బిసి నాయకులు, కార్యకర్తలు, మండల టిడిపి ప్రజా ప్రతినిధులు, సీనియర్ నాయకులు, సర్పంచులు, ఎంపీటీసీలు, గ్రామ కమిటీ అధ్యక్షులు బూత్ కమిటీ కన్వీనర్లు , కార్యకర్తలు నందమూరి అభిమానులు పాల్గొని విజయవంతం చేశారు.

రేపు స్కౌట్స్ అండ్ గైడ్స్ యూనిట్స్‌కు శిక్షణ

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : స్కౌట్స్ అండ్ గైడ్స్ యూనిట్ ప్రారంభకులకు ఈ నెల 12వ తేదీ సోమవారం బిగినర్స్ కోర్సులో శిక్షణ ఇవ్వనున్నట్లు జిల్లా ఆర్గనైజర్ కమిషనర్ వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. జిల్లా విద్యాశాఖ అధికారి ఆదేశాల మేరకు పుత్తూరు, నారాయణవనం, పిచ్చాటూరు, నాగలాపురం మండలాల్లోని ప్రభుత్వ ప్రైవేటు ప్రాథమిక, ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు మండల విద్యాశాఖ అధికారులు, ప్రతి పాఠశాలలో స్కౌట్స్ అండ్ గైడ్స్ కి వేరువేరుగా ఉపాధ్యాయులను పంపాల్సి ఉంటుంది. సోమవారం పుత్తూరు జడ్పీ గర్ల్స్ హై స్కూలులో స్కౌట్స్ అండ్ గైడ్స్ బిగినర్స్ కోర్స్ నిర్వహించనున్నారు. 25 సంవత్సరాలు నిండి డిగ్రీ పూర్తి చేసిన యువకులు, వారు రోవర్ లీడర్లుగాను , 21 సంవత్సరాలు నిండి డిగ్రీ పూర్తి చేసిన ఆడవారు రేంజర్స్ గాను పనిచేసేందుకు శిక్షణ పందవచ్చన్నారు. ఫీజు 381రూపాయలు, బుక్‌కు రూపాయలు చెల్లించాలని సూచించారు.

మంత్రి రోజా వ్యాఖ్యలు హాస్యాస్పదం: టిడిపి

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్: వైసిపి పేటిఎం బ్యాచ్ తయారు చేసిన ఫేక్ కూడా తన నోటి దురుసుతనానికి మంత్రి రోజా వాడుకోవడం హాస్యాస్పదంగా ఉందని ఐటిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి జి.గోపీనాథ్ పేర్కొన్నారు. ఒక బాధ్యతాయుతమైన రాష్ట్ర మంత్రి పదవిలో ఉన్న రోజా నకిలీ ఫొటో ఏదో..అసలు ఫొటో ఏదో తెలియలేని పరిస్థితిలో ఉండటం ఆమె అపరిపక్వతకు నిదర్శనం అన్నారు. వైసిపి పేటిఎం బ్యాచ్ ఇకనైనా ఫేక్ ప్రచారాలు మానాలని హితవు పలికారు. ముఖ్యమంత్రి జగన్ రెడ్డి దగ్గర మైలేజ్ కోసం చంద్రబాబు ని విమర్శిస్తే తనకు సీటు కన్ఫామ్ అవుతుందని మంత్రి రోజా భావిస్తున్నారని, ఒకవేళ ఆమె పోటీ చేసినా టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి గాలి భానుప్రకాష్ చేతిలో ఓడిపోవడం ఖాయమన్నారు. ఈ కార్యక్రమంలో ఐటిడిపి సభ్యులు చంద్రశేఖర్ రెడ్డి, ఈశ్వర్ యాదవ్, క్రిష్ణన్, తులసీలింగం, శ్యామ్‌రాజ్ మహేష్, బుజ్జిబాబు, ఇళంగోవన్ పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం పరిశీలన

ప్రజాశక్తి-బుచ్చినాయుడు కండ్రిగ: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ హైస్కూల్ ఎంపిపి పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు ఆధ్వర్యంలో మధ్యాహ్న భోజనాన్ని మండల రెండవ విద్యాశాఖ అధికారి ముని సుబ్రహ్మణ్యం శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. విద్యార్థులకు రుచికరం తోపాటు నాణ్యమైన కూరగాయలతో రుచికరంగా పోషించిందా చేసి పెట్టాలన్నారు. అనంతరం పదో తరగతి విద్యార్థులకు తరగతి పరీక్షల పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

దొరవారిసత్రం: మండల పరిధిలోని నేలపట్టు గిరిజన కాలనీలో ఉన్న ప్రాథమిక పాఠశాలను, శనివారం స్థానిక ఎంఈఓ - 2 కృష్ణయ్య తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ముందుగా పాఠశాలకు సంబంధించిన వివిధ రికార్డులను తనిఖీ చేశారు. అనంతరం విద్యార్థుల విద్యా బోధన గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. వీటితో పాటు విద్యార్థుల జగనన్న గోరుముద్ద రికార్డులను తనిఖీ చేసి, నిర్వాహకులకు సలహాలు సూచనలు అందించారు. మెనూ ప్రకారం విద్యార్థులకు అందించాలని లేదంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. విద్యార్థులకు తెలిపే పాఠాలు పీరియడ్ ప్లాన్ ప్రతి ఉపాధ్యాయుడు రాయాలని ఉపాధ్యాయులకు సలహాలు సూచనలు అందించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు పోలయ్య, ఉపాధ్యాయు లు పాల్గొన్నారు.

మఠం భూములను కొని నష్టపోవద్దు: రమేష్ నాయుడు

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం):

హథీరాంజీ మఠంకు సంబంధించిన భూములను కొని నష్టపోవద్దని హథీరాంజీ మఠం డిప్యూటీ కలెక్టర్, ఫిట్ పర్సన్ రమేష్ నాయుడు విజ్ఞప్తి చేశారు. శనివారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ హథీరాంజీ మఠంకు చెందిన భూములను కొందరు ఉద్దేశపూర్వకంగా ఆక్రమించుకొని వేరే సర్వే నెంబర్‌తో మఠంకు సంబంధించిన భూములను విక్రయించారని ఎంతో కష్టపడి కూడబెట్టుకున్న ధనాన్ని ఇటువంటి లావాదేవీలకు ఉపయోగించి వద్దని ప్రజలకు సూచించారు. హథీరాంజీ మఠం భూముల విషయంలో సుప్రీంకోర్టు సుదీర్ఘ విచారణ చేపట్టిందన్నారు. ఢిల్లీ నుంచి తిరుపతి వరకు మఠం భూములు అన్యాక్రాంతం కాపడకుండా సుప్రీం ధర్మాసనం ఆందోళన వ్యక్తం చేసిందన్నారు. ఈ పరిస్థితుల్లో మఠం భూములను కొని నష్టపోవద్దని హితవు పలికారు.

ఎస్‌బిఐలో సిగ్నల్ సమస్య
కష్టాల్లో ఖాతాదారులు

ప్రజాశక్తి - వెంకటగిరి(బాలాయపల్లి):

వెంకటగిరి పట్టణం కాజీపేట వద్ద ఉన్న స్టేట్ బ్యాంకులో సిగ్నల్స్ సమస్య వల్ల ఖాతాదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సిగ్నల్స్ లేకపోవడంతో లావాదేవీలు నిలిచిపోతున్నాయి. దీంతో దూర ప్రాంతాల నుండి బ్యాంకుకు వచ్చిన వారు నిరాశతో వెనుతిరగాల్సిన పరిస్థితి నెలకొంది. మరో వక్క ఏటీఎంలు సైతం పనిచేయక పోవడంతో ఖాతాదారులు మరింత ఇబ్బందులకు గురవుతున్నారు. ఉదయం నుంచి బ్యాంక్ అధికారులు సిగ్నల్ సమస్యను పట్టించుకోక పోవడం వల్ల రైతులు, ప్రజలు, వ్యాపార సంస్థల యజమానులు పడరాని పాట్లు పడుతున్నారు. దీంతో ప్రజలు అవసరాల నిమిత్తం ప్రైవేటు వ్యక్తుల వద్ద కమిషన్ చెల్లించి డబ్బులు తీసుకుంటున్నారు. మరి కొంత మంది ఖాతాదారులు బ్యాంకు సేవలు అందుబాటులోకి వస్తాయని బ్యాంకులో వేచి చూస్తున్నారు. తరచూ ఈ సమస్య వస్తోంది. ఇదే విషయంపై బ్యాంక్ మేనేజర్‌ను వివరణ కోరగా నెట్‌వర్క్ లేకపోతే తామేమి చేయలేమంటూ చెప్పుకొచ్చారు.

కరిగిపోతున్న 'కొండలు'

- కోట్లల్లో గ్రావెల్ మాఫియా ఆర్జన
- పరిమితులకు మించి తవ్వకాలు
- కాసులు కురిపిస్తున్న ఎర్రబంగారం
- గ్రామస్తుల ఫిర్యాదులన్నీ బుట్టదాఖలు

ప్రజాశక్తి - ఓజిలి

కొండలు కరిగిపోతున్నాయి.. కొన్నాళ్లు పోతే కొండలు చరిత్రలోనే నిలిచిపోయే ప్రమాదం లేకపోలేదు. గ్రావెల్ మాఫియాకు ఎర్రబంగారం కాసులు కురిపిస్తుండడంతో యంత్రాలతో కొండలను పీల్చి పిప్పి చేస్తున్నారు. అక్రమ మార్గాల్లో గ్రావెల్ దందా యధావిధంగా సరిహద్దులు దాటుతోంది. వేలాది క్యూబిక్ మీటర్ల గ్రావెల్ తవ్వకాలతో ప్రకృతి వనరులు ధ్వంసం అవుతున్నాయి. ఒక లారీ గ్రావెల్ రూ.20వేలు ధర పలుకుతుంది. మాచవరం గ్రామం నుంచి రోజుకు 20 ట్రిప్పులు తరలిస్తుండటం గమనార్హం.

నాయుడుపేట మండలం మేనకూరు పరిశ్రమ వాడలకు, లేఔట్లకు గ్రావెల్‌కు మంచి డిమాండ్ ఉంది. విలువైన ఎర్ర బంగారం ఓజిలి మండలం మాచవరం పరిధిలో ఉంది. కొండరు పిండిచేస్తూ ఎర్ర బంగారాన్ని తవ్వి భారీ స్థాయిలో గ్రావెల్ అక్రమ మార్గాన రాత్రికి రాత్రే దర్జాగా దాటించేస్తున్నారు. అధికారులే 'సిసి కెమెరాలు'గా ఈ అక్రమ ఆర్జనకు ఉపయోగ పడుతుందన్నారన్నది కాదనలేని నిజం. ఓజిలి మండలంలోని ముమ్మయి పాలెం గ్రామ రెవెన్యూ పరిధిలో సర్వే నంబర్ 226లో గతంలో ఓ వ్యక్తికి గ్రావెల్‌కోసం 9 ఎకరాల వరకు అనుమతి ఇచ్చారు. అయితే పరిధికి మించి గ్రావెల్ అక్రమ రవాణా సాగుతుందని గ్రామస్తులు పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ప్రేక్షకపాత్ర పోషించారు. పరిసర ప్రాంతం చుట్టూ కొన్ని ఎకరాల విస్తీర్ణంలో గ్రావెల్‌ను అడ్డగోలుగా కొల్లగొడుతున్నారు. పరిమితులు ఒకచోట గ్రావెల్ తరలింపులు మరో చోట అన్న చందంగా ఈ దందా సాగుతోంది. గ్రామస్తులు సంబంధిత శాఖలకు ఫిర్యాదు చేసినా బుట్టదాఖలే అవుతున్నాయన్న విమర్శలున్నాయి. 'కంచే చేను మేస్తే' అన్న చందంగా కాపాడాల్సిన రెవెన్యూ, గనుల శాఖే అక్రమ దందాకు అండగా నిలిస్తే కాపాడేవారు ఎవరు?

యథేచ్ఛగా గ్రావెల్ తవ్వకాలు సాగిస్తున్న దృశ్యం

ప్రజా సంక్షేమమే లక్ష్యం: మంత్రి

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి సచివాలయం వ్యవస్థను తీసుకురావడంతో ప్రజాసంక్షేమమే లక్ష్యంగా పాలన అందిస్తు న్నారని 'మాటల్లో కాదు..చేతల్లో అభివృద్ధి చేస్తున్న ఏకైక నాయకుడు జగన న్న..' అని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక వ్యవహారాల, యువజన సర్వీసుల, క్రీడా శాఖ మంత్రి ఆర్కె రోజా పేర్కొన్నారు. పుత్తూరు రూరల్ మండలంలోని ఉత్తరపుకండ్రిగలో 40 లక్షల రూపాయలతో నిర్మించిన సచివాలయం నూతన భవనాన్ని శనివారం మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సచివాలయ వ్యవస్థతో ప్రజల వద్దకు పరిపాలన రావడం ద్వారా ప్రజలందరూ వారి ఇంటివద్దనే సమస్యలను పరిష్కరించు కుంటున్నారన్నారు. ఇన్ని సంక్షేమ పథకా లు, అభివృద్ధిని అందిస్తున్న జగన్‌ను మరో సారి ఆశీర్వదించాలన్నారు. తనను మూడో సారి ఎమ్మెల్యే గా ఆశీర్వదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ప్రసాద్, ఎంపీపీ మునివేలమ్మ, వైస్ ఎంపీపీ మునస్వామి రెడ్డి, ఎంపీటీసీలు సర్పంచులు పుత్తూరు రూరల్ ప్రజా ప్రతినిధులు, వైసిపి నాయ కులు, కార్యకర్తలు, మండల అధికారులు పాల్గొన్నారు.

సచివాలయ భవనాన్ని ప్రారంభిస్తున్న మంత్రి రోజా

ఆకట్టుకున్న ఇన్‌స్పైర్ సైన్స్ మేళా

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: స్థానిక జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో శనివారం నిర్వహించిన జిల్లాస్థాయి ఇన్‌స్పైర్ మనక్ వైజ్ఞానిక ప్రదర్శన ఆకట్టుకుంది. స్థానిక ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి, జెసి శుభం బన్సల్, డీఈవో రాజశేఖర్ మేళాను ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఏర్పాటు చేసిన ప్రాజెక్టుల స్టాల్స్‌ను వారు పరిశీలించారు. ఉత్తమ ప్రాజెక్టులను తయారు చేసిన విద్యార్థులను అభినందించారు. ఎమ్మెల్యే మాట్లా డుతూ విద్యార్థుల్లో శాస్త్రీయ ప్రతిభను వెలికితీసి వారిని బాల శాస్త్రవేత్తలుగా తీర్చిదిద్దేందుకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఇలాంటి ఇన్‌స్పైర్ మనక్ వైజ్ఞానిక మేళాలు నిర్వహించడం గొప్ప విషయం అన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఛైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు, జిల్లా సైన్స్ అధికారి భానుప్రసాద్, సీఎంవో సురేష్, ఎంఈవోలు భువనేశ్వరి, బాలయ్య, ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసులు, ఢిల్లీ నుంచి వచ్చిన ఎన్ఐఎఫ్ పరిశీలకులు డాక్టర్ మహ్మద్ రయీజ్, దివ్యాన్ష్ పాల్గొన్నారు.

విద్యార్థుల వైజ్ఞానిక ప్రదర్శనలను తిలకిస్తున్న డిఇవో రాజశేఖర్, ఎమ్మెల్యే మధుసూదనరెడ్డి

29 నుండి శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు

ప్రజాశక్తి -రామచంద్రాపురం (చంద్రగిరి): చంద్రగిరి మండలం శ్రీనివాసమంగాపురం శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఈ నెల 29వ తేదీ నుండి మార్చి 8వ తేదీ వరకు వార్షిక బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ అధికారులు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఫిబ్రవరి 28వ తేదీ సాయంత్రం అంకురార్పణతో స్వామివారి బ్రహ్మోత్సవాలు ప్రారంభమవుతాయన్నారు. ఉదయం 8 నుండి 9 గంటల వరకు, రాత్రి 7 నుండి 8 గంటల వరకు వాహనసేవలు నిర్వహిస్తామని తెలిపారు. 29వ తేదీ ధ్వజారోహణం, రాత్రి పెద్దశేష వాహనం, మార్చి 1వ తేదీ చిన్నశేష వాహనం, రాత్రి హంస వాహనం, 2వ తేదీ ఉదయం సింహ వాహనం, రాత్రి ముత్యపుపందిరి వాహన సేవలు నిర్వహిస్తారు. 3వ తేదీ ఉదయం కల్పవృక్ష వాహనం, రాత్రి సర్వభూపాల వాహనం, 4వ తేదీ ఉదయం పల్లకీ ఉత్సవం(మోహినీ అవతారం), రాత్రి గరుడ వాహనం, 4 తేదీ ఉదయం హనుమంత వాహనం, సాయంత్రం స్వర్ణరథం, రాత్రి గజ వాహన సేవలు నిర్వహిస్తారు. 6వ తేదీ ఉదయం సూర్యప్రభ వాహనం, రాత్రి చంద్రప్రభ వాహనం, 7వ తేదీ ఉదయం రథోత్సవం, రాత్రి అశ్వవాహనం, 8వ తేదీ ఉదయం చక్రస్నానం, రాత్రి ధ్వజావరోహణం తో స్వామివారి బ్రహ్మోత్సవాలు ముగుస్తాయని ఆలయ అధికారులు తెలిపారు.

22న కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం

శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామి వారి ఆలయంలో ఫిబ్రవరి 22వ తేదీ ఉదయం 6 నుండి 10 గంటల వరకు కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహించనున్నారు. బ్రహ్మోత్సవాల ముందు కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం ఆనవాయితీగా నిర్వహిస్తున్నారు.

షర్మిల రోడ్ షోను విజయవంతం చేయండి: జంగా గౌతం

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): నగరిలో ఆదివారం నిర్వహించనున్న ఆంధ్రప్రదేశ్ పిసిసి అధ్యక్షురాలు వైఎస్ షర్మిల రెడ్డి రోడ్ షోకు ఉమ్మడి చిత్తూరు జిల్లా కాంగ్రెస్ శ్రేణులు పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని ఏపీసీసీ వర్కింగ్ ప్రసిడెంట్ జంగా గౌతం పిలుపు నిచ్చారు. తిరుపతి ప్రెస్ క్లబ్‌లో శనివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సీఎం జగన్ రాష్ట్ర ప్రజల ప్రయోజనాలను ఢిల్లీ పెద్దలకు తాకట్టు పెట్టడానికే ఢిల్లీ వెళ్లారని ఆరోపించారు. సాధారణ ఎన్నికల సమీపిస్తున్న సమయంలో ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్ రూపకల్పనలకు వివిధ రాష్ట్రాల నుండి రాష్ట్ర ప్రభుత్వ ప్రతినిధులు తగిన నిధుల కేటాయింపు కోసం కేంద్ర ప్రభుత్వం వద్దకు వెళుతున్నారని కానీ ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్ ముగిశాక సీఎం జగన్ ఢిల్లీ వెళ్లి పెద్దల కాళ్లు మొక్కారన్నారు. కానీ సీఎం జగన్ పర్యటన అనంతరం ఆయన పోలవరానికి నిధులు ఇవ్వాలని, మిగులు బిల్లుల చెల్లింపునకు వెళ్లారన్నట్టుగా పత్రికల్లో వార్తలు వచ్చాయన్నారు. ఇది పూర్తిగా అవాస్తవమని, సీఎం జగన్ నిజస్వరూపాన్ని ప్రజలు గ్రహించాలని ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు. సీఎం జగన్ ఢిల్లీ పర్యటన వివరాలను రాష్ట్ర ప్రజలకు వివరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పిసిసి ఉపాధ్యక్షులు వేణుగోపాల్ రెడ్డి, తిరుపతి జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు శ్రీనివాసులు రెడ్డి, శాంతి యాదవ్, రవికుమార్, భాస్కర్, తేజవతి, మునిశోభ, నారాయణ, జావేద్ పాల్గొన్నారు.

దొంగ ఓట్ల వెనుక సూత్రధారులెవరు?: టిడిపి

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): ప్రజాభీష్టం మేరకు రాజకీయ పార్టీలు అధికారం చేపట్టాలే గాని దొంగ ఓట్లతో అధికారులను బలి పశువులు చేస్తూ తిరిగి అధికారం చేపట్టడానికి కుట్రలు పన్నుతున్న వైసీపీని ప్రజలు చీదరించుకోవడం ఖాయమని టిడిపి సీనియర్ నాయకులు బుజ్జిబాబు నాయుడు అన్నారు. శనివారం తిరుపతి ప్రెస్ క్లబ్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ దొంగ ఓట్లను తమ లాగిన్ ద్వారా నమోదు చేసిన అధికారులను కాదు సస్పెండ్ చేయాల్సింది.. కటకటాల వెనక్కు పంపా ల్సిందని, దొంగ ఓట్ల వెనక ఉన్న సూత్రధారులను బయట పెట్టేలా కేంద్ర ఎన్నికల సంఘం చర్యలు చేపట్టాలని కోరారు. ఇల్లు ఇల్లు తిరిగి దొంగ ఓట్లను గుర్తించి అధికారులకు ఆధారాలతో సహా ఇచ్చినా ఏ మేరకు చర్యలు తీసుకుంటారో తెలియడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో లక్ష్మీపతి, తులసి, శ్రీనివాసులు, మధుసూదన్, సుబ్బరాయులు నాయుడు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న టిడిపి నాయకులు

జగన్ అరాచకాలపై లోకేష్ శంఖారావం

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి రాష్ట్రంలో సాగిస్తున్న అన్యాయాలు, అరాచకాలను ప్రజలకు తెలిపేందుకు టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ పూరించిన నాదమే శంఖారావమని ఆ పార్టీ శ్రీకాళహస్తి నియోజకవర్గం ఇన్‌చార్జి బొజ్జల సుధీర్ రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. యువగళం పాదయాత్ర నిర్వహించని నియోజకవర్గాల్లో 50 రోజుల పాటు లోకేష్ ఈ శంఖారావం యాత్ర చేస్తారని తెలిపారు. ప్రజలు, యువత, రైతులు అన్ని వర్గాల ప్రజలు లోకేష్ సభలకు తరలి వచ్చేందుకు ఆసక్తిగా చూస్తున్నారని వివరించారు.ఆంధ్రప్రదేశ్ పారిశ్రా మికంగా అభివృద్ధి చెందాలన్నా, యువత కి ఉద్యోగాలు రావాలన్నా, ప్రజల ఆస్థికి రక్షణ ఉండాలన్నా చంద్రబాబు ముఖ్యమంత్రి కావాలని సుధీర్ తెలిపారు.

మాట్లాడుతున్న బొజ్జల సుధీర్‌రెడ్డి

పొదుపు సంఘాలకు రూ.50 కోట్లపైనే రుణాలు

- ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య

ప్రజాశక్తి -దొరవారిసత్రం: ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి పరిపాలనలో నేటి వరకు పొదుపు సంఘాల అభివృద్ధికి 50 కోట్ల రూపాయల పైనే పలు రకాల ఆర్థిక రుణాలు అందించామని సూళ్లూరుపేట ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య పేర్కొన్నారు. దొరవారి సత్రం మండల వైయస్సార్ క్రాంతి పథం కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన ఆసరా నగదు పంపిణీ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా మండల పరిధిలోని పొదుపు సంఘాలకు 4,62,00,00 లక్షల రూపాయల చెక్కును ఎంపీపీ దువ్వూరు సుజాతమ్మ, వైస్ ఎంపీపీ దువ్వూరు గోపాల్ రెడ్డి చేతుల మీదుగా పొదుపు సభ్యులకు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2019 జగన్మోహన్ రెడ్డి పరిపాలన 2024 వరకు మండలంలోని 955 పొదుపు సంఘాల సభ్యులకు వివిధ పథకాల ద్వారా ఆర్థిక చేయూతగా 50,74,03,724 కోట్ల రూపాయల రుణాలను అందిందించామన్నారు. ప్రతి మహిళ కుటుంబ ఆర్థిక స్థితి మెరుగుకు ఎన్నో అవకాశాలు కల్పించామన్నారు. ఎన్నో అభివృద్ధి పథకాలు మహిళలకు అందించిన ఘనత వైయస్ జగన్మోహన్ రెడ్డిదే అన్నారు. రాబోయే ఎన్నికల్లో జగన్మోహన్ రెడ్డిని సీఎంగా మళ్లీ ఎన్నుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల కన్వీనర్ ఈశ్వరబాక శ్రీనివాసులు రెడ్డి, మండల నాయకుడు వేణుబాక మునిస్వామి నాయుడు, ఏరియా కోఆర్డినేటర్ మురళి, ఇన్‌ఛార్జి ఎంపీడీవో రఘురామయ్య, వైయస్సార్ క్రాంతి పథకం మండల ఏపిఎం పద్మావతి, సీసీలు చంద్రయ్య, నారాయణ, ఉష, పోలమ్మ, వివో ఏలు, సంఘ బంధం అధ్యక్షులు, పొదుపు సభ్యులు పాల్గొన్నారు.



పొదుపు సంఘాలకు ఆసరా చెక్కులు పంపిణీ చేస్తున్న నాయకులు

అలరించిన 'సఫ్ఫలత కా రాస్తా'

ప్రజాశక్తి -తిరుపతి సిటీ: నారాయణ గ్రూప్ విద్యా సంస్థల ఆధ్వర్యంలో పదవ తరగతి విద్యార్థులకు శనివారం నిర్వహించిన 'సఫలతా కా రాస్తా' పలువురిని అలరించింది. స్థానిక శిల్పారామంలో నిర్వహించిన కార్యక్రమానికి ఆ సంస్థల డైరెక్టర్ పొంగురు షారాణి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పదో తరగతి విద్యార్థులను ఉద్దేశించి ఆమె మాట్లాడుతూ పదవ తరగతి పబ్లిక్ పరీక్షలకి హాజరయ్యే విద్యార్థులు తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొంటున్నారన్నారు. వారిలో మానసిక ధైర్యాన్ని నింపుతూ భయాన్ని పోగొట్టేందుకు ఇలాంటి అవగాహన కార్యక్రమాలను నారాయణ విద్యా సంస్థలు ప్రతి ఏడాది నిర్వహిస్తోందన్నారు. కరోనా తర్వాత విద్యార్థుల్లో మరింత మానసిక ఒత్తిడి దరిచేరిందని, దీన్ని వారు ఎదుర్కొనేలా ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు స్నేహపూర్వక వాతావరణంలో మెలగాలన్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకొని తమ విద్యా సంస్థల్లో 2021 నుండి ఇలా విద్యార్థులకు అవగాహన కార్యక్ర మాలను నిర్వహించి, మనోధైర్యాన్ని నింపుతున్నామన్నారు. అందులో భాగంగా నేడు జిల్లా వ్యాప్తంగా తమ విద్యా సంస్థల్లో చదువుతున్న పదో తరగతి విద్యార్థులను ఒకచోటకు చేర్చి, వారికి పబ్లిక్ పరీక్షలపై భయాన్ని పోగొట్టడంలో భాగంగా అవగాహన కల్పిస్తున్నామన్నారు. ఇలాంటి కార్యక్రమాలు ద్వారా పిల్లల్లో మానసికస్థైర్యం పెరుగుతుందన్నారు. అనంతరం పిల్లలతో ముఖాముఖిలో పాల్గొని, వారితోపాటు ఆడుతూ పాడుతూ విద్యార్థుల్లో ఉత్సాహం నింపారు. ఈ కార్యక్రమంలో నారాయణ విద్యాసంస్థల చిత్తూరు జిల్లా డిజిఎం కొండలరావు, ఏజీఎంలు కిషోర్, పణి కుమార్, ఆర్ అండ్ డి హెడ్ రాజేష్, ఆర్ఐలు, కోఆర్డినేటర్లు, ప్రిన్సిపాల్‌లు, ఇన్‌ఛార్జిలు, ఏవోలు, ఉపాధ్యాయులు విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

సఫలత కా రాస్తా కార్యక్రమంలో పాల్గొన్న పదవ తరగతి విద్యార్థులు

క్రైం న్యూస్

గల్లంతైన విద్యార్థి మృతదేహం వెలికితీత

ప్రజాశక్తి - నాగలాపురం: రెండు రోజుల క్రితం భూపతేశ్వర కోన మడుగులో గల్లంతైన విద్యార్థి మృతదేహాన్ని పోలీసులు శనివారం వెలికితీశారు. పోలీసుల కథనం మేరకు..నాగలాపురం ఎస్ఐ ఓబయ్య సమాచార మేరకు విహారానికంటూ చెన్నైలోని ఓ కాలేజీ విద్యార్థులు తొమ్మిది మంది రెండు రోజుల క్రితం భూపతేశ్వర కోన (సద్ది కూడు మడుగు) కు వచ్చారు. జలపాతం వద్దనున్న మడుగులో పై నుండి దూకిన శ్యామ్ (20) మడుగులో గల్లంతు అయ్యాడు. గుర్తించిన తోటి స్నేహితులు ఎంత ప్రయత్నించినా ఫలితం లేకపోవడంతో పోలీసులకు గురువారం సమాచారం అందించారు. అప్పటికే చీకటి పడటంతో ఫలితం లేక శుక్రవారం ఉదయం పోలీసులు ప్రయత్నించినా ఫలితం లేకుండాపోయింది. శనివారం ఉదయం గజ ఈతగాళ్లను పిలిపించారు. గజ ఈత గాళ్లతో తీవ్ర ప్రయత్నం అనంతరం శనివారం మధ్యాహ్నం మృతదేహాన్ని వెలికి తీశారు. మృతదేహానికి అక్కడే పోస్టుమార్టం నిర్వహించి తల్లిదండ్రులకు అప్పగించారు. ఈ సంఘటనపై విద్యార్థి తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

పట్టించుకోని పర్యాటకులు

భూపతేశ్వర కోనలో పర్యటించడానికి అనుమతులు లేవని ఇటు ఫారెస్ట్ అధికారులు, అటు పోలీసులు ఎన్ని హెచ్చరికలు చేసినా వాటిని పట్టించుకోకుండా పర్యాటకులు వెళుతుండడం తరచూ ప్రమాదాలకు చోటుచేసుకుంటున్నాయి.

చికిత్స పొందుతూ మృతి చెందిన చిరుత

రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ చిరుత మృతి

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): అనంతపురం జిల్లా పెనుగొండ ప్రాంతంలో తీవ్రంగా గాయపడ్డ చిరుత శనివారం మృతి చెందినట్లు తిరుపతి శ్రీ వెంకటేశ్వర జంతుప్రదర్శనశాల అధికారులు తెలిపారు. రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన చిరుతను మెరుగైన చికిత్స నిమిత్తం శ్రీ వెంకటేశ్వర జంతు ప్రదర్శనశాల సంజీవని వైద్యశాలలో మెరుగైన చికిత్స నిమిత్తం అందించడానికి అక్కడి అటవీ శాఖ అధికారులు ఇక్కడికి తరలించారు. రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ చిరుత లేవలేని పరిస్థితుల్లో ఉందని అధికారులు తెలిపారు. మూడు రోజులు చికిత్స అనంతరం చిరుత శరీరం వైద్యానికి సహకరించక మృతి చెందినట్లుగా తెలిపారు. చిరుత మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం వెటర్నరీ కళాశాలకు అధికారులు తరలించారు. సేఫ్టీ సెమిక్ షాక్, లింపోసర్కోమా కారణంగా చిరుత మృతి చెందినట్లు వెటర్నరీ రిపోర్టును మీడియాకు తెలిపారు.

భయాదోళనకు గురిచేస్తున్న కుక్కల సంచారం

భయం..భయం..!

- కుక్క కాట్లతో ప్రజలు బెంబేలు
- వీధుల్లో పరుగులు తీయాల్సిన పరిస్థితి
- చర్యలు తీసుకోని అధికారులు

ప్రజాశక్తి-బుచ్చినాయుడు కండ్రిగ: మండలంలోని 28 పంచాయతీలలో కుక్కలు బెడద అధికమైంది. ప్రజలు బయటకు వెళ్లాలంటే భయాందోళనకు గురి కావాల్సి వస్తోంది. రోడ్డు మీద వెళ్లే పిల్లలను, పెద్దలను, వాహన చోదకులను తరుముకుంటూ దారుణంగా కరుస్తున్నాయి. సైకిల్ మీద, బైకుల మీద ప్రయాణం చేస్తున్న వారిని తరిమి మరీ కరుస్తున్నాయి. మేకపిల్లలు, కోళ్లు, గొర్రె పిల్లలు దూడలను కూడా ఇవి వదలట్లేదు.. వీటి వల్ల గ్రామాల ప్రజలు ఏ సమయంలో ఏ ముప్పు ముంచుకొస్తుందో తెలియక భయాందోళనకు గురవుతున్నారు. బయటకు వెళ్లాలంటే చేతిలో కర్ర లేదంటే రాయి తీసుకొని వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. ఇదే పరిస్థితి కొనసాగితే మండలంలో చిన్న జంతువుల ప్రాణాలకు ముప్పుతెచ్చే ప్రమాదం వుంది. ఇకనైనా మండల స్థాయి అధికారులు, పంచాయతీ సర్పంచులు వీధి కుక్కల నివారణకు చర్యలు తీసుకోవాల్సి వుంది. ముఖ్యంగా ఈ వీధి కుక్కలు బుచ్చినాయుడు కండ్రిగ పంచాయతీలో కొన్ని వేల సంఖ్యలో రోడ్ల మీద తిరుగుతున్నాయి. విద్యార్థులు ఆడుకునే ఆట స్థలంలో ఎక్కువగా ఉంటున్నాయి. ఉదయాన్నే కొంతమంది ఆట స్థలంలో వాకింగ్ చేయాలన్నా కర్ర లేదా రాయి పట్టుకొని తిరగాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. మేజర్ పంచాయతీలోనే ఇలా ఉంటే మిగతా చిన్న చిన్న పంచాయతీల్లో అధికారుల పనితీరు ఎలా ఉంటుందో గమనించవచ్చు. ఇకనైనా అధికారులు స్పందించి జంతువుల ప్రాణాలను, ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాలని మండల ప్రజలు కోరుతున్నారు. వీటి నివారణకు పంచాయతీ అధికారులు తగిన నియంత్రణ చర్యలు చేపట్టాల్సి వుంది.

మురుగునీటిలో తాగునీటి పైప్ లైన్

- కలుషిత నీరే ఆధారం
- నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న అధికారులు

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : పట్టణంలోని స్థానిక షాపు వీధిలో సిమెంటు రోడ్డువద్ద పైప్ లైన్ మరమ్మతుకు గురైంది. గత కొన్ని రోజులుగా తాగునీటిలో మట్టి నీరు కలుషితమైన వార్డు ప్రజలకు కలుషితమైన నీటిని తాగాల్సి వస్తోందని ఈ కారణంగా రోగాల బారిన పడే ప్రమాదం వుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై పలుమార్లు సంబంధిత మున్సిపల్ శాఖ వారికి ఫిర్యాదు చేసినా నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని స్థానికులు వాపోతున్నారు. తప్ప ఇంతవరకు ఎవరూ పట్టించుకున్న పాపాన పోలేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత మున్సిపల్ అధికారులు స్పందించి మరమ్మతుకుగురైన పైపులైను మరమ్మతు చేసి ప్రజలకు మంచి నీటిని సరఫరా చేయాలని కోరుచున్నారు ఇప్పటికైనా స్పందించకపోతే మున్సిపల్ కార్యాలయం ఎదుట వార్డు ప్రజలు ధర్నా చేపడుతామని హెచ్చరిస్తున్నారు.

వృద్ధులకు నిత్యావసర సరుకులు పంపిణీ

గూడూరు - ప్రజాశక్తి రూరల్ : గూడూరు పట్టణంలోని రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ప్రతినెల క్రమం తప్పకుండా నిర్వహించే హెల్ప్‌ఏజ్ కార్యక్రమం లో భాగంగా శనివారం అల్లూరి ఆది శేషారెడ్డి రోటరీ భవన్ నందు 28 మంది పేద వృద్ధులకు ఫల సరుకులు, బియ్యం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా అసిస్టెంట్ గవర్నర్ రొటేరియన్ బి .శ్యామ సుందర్ రావు, రొటేరియన్ రవికుమార్ , బలరాం రెడ్డి, పాల్గొన్నారు.

IN THE COURT OF THE PRL.JUNIOR CIVIL JUDGE-CUM-JUDICIAL FIRST CLASS MAGISTRATE::PUTTUR
O.S.No.395/2022

Between:
K.Rajani and Others ...Plaintiffs
and
S.Mohan Rao and others ... Defendants

SUMMONS TO THE DEFENDANTS NO. 1 TO 3

D1: S.Mohan Rao, S/o. Late S. Chenchu Ramaiah
D2: S.Ananda Babu, S/o. Late Kalappa
D3: S.Jagadeesh, S/o. Late Kalappa

Defendants No.1 to 3 are residing at D.No.17-379/2B, Korlagunta, Maruthi Nagar, Tirupati, Tirupati District, Andhra Pradesh.

Please take summons that, the plaintiffs filed suit for partition in the above Hon'ble Court against you and others and the above suit is posted to 21/02/2024 for your appearance. So, please to be attend on 21/02/2024 at 10-30 a.m. before the above Hon'ble Court either in person or through your advocate, failing which the matter will be decided exparte against you on your absence. This is the order of the above Hon'ble Court.

Sd/-
MURUGESHAN REDDY
Advocate, Puttur.